క్లుప్తంగా

సంపరలో వినాయకుడికి పంచామృతాభిషేకాలు



సంపరలో ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

పెదపూడి: సంపర గ్రామంలో పంట కాలువ సమీపంలో ఉన్న ప్రసిద్ధి చెందిన సిద్ధి వినాయకుడికి బుధవారం గరికిపూజ, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

104 వాహనాల పరిశీలన



వాహనాలను పరిశీలిస్తున్న అధికారి ప్రియాంక

రాజానగరం: ప్రస్తుతం రాజానగరం, రంగంపేట మండలాలలో సేవలందిస్తున్న 104 వాహనాలను జిల్లా సమన్వయ అధికారి పి.ప్రియాంక బుధవారం పరిశీలించారు. ఆయా వాహనాల పనితీరుతోపాటు వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నదీ, లేనిదీ తనిఖీ చేశారు. వాహనాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని, మెడిసిన్ కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ రెండు మండలాలలో ప్రస్తుతం నాలుగు 104 వాహనాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

రాజానగరం: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలోని 11 కేవీ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి రూరల్ ఆపరేషన్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. రాజానగరంలోని వినియోగదారులు గమనించాలన్నారు.

నేటి నుంచి జీఎస్‌ఎల్‌లో సిమ్యుల్కాన్-2024

రాజానగరం: సొసైటీ ఫర్ హెల్త్‌కేర్ సిమ్యులేషన్ (ఎస్‌హెచ్‌ఎస్) ఆధ్వర్యంలో 6వ వార్షిక నేషనల్ హెల్త్‌కేర్ సిమ్యులేషన్ కాన్ఫరేషన్స్, సిమ్యుల్కాన్-2024ను గురువారం నుంచి 9వ తేదీ వరకు స్థానిక జీఎస్‌ఎల్ వైద్య కళాశాలలో నిర్వహించనున్నారు. 'హెల్త్‌కేర్ సిమ్యులేషన్‌లో కొత్త అన్వేషణలు' అనే ప్రధాన అంశంపై ఈ కాన్ఫరెన్స్ జరుగనుంది. సిమ్యులేషన్ రంగంలో దేశ, విదేశాలలో పేరొందిన ప్రముఖులు హాజరై, 'హెల్త్‌కేర్ సిమ్యులేషన్‌లో ఇన్నోవేషన్స్, ఆగ్మెంటెడ్ రియాల్టీ, సిమ్యులేషన్ ప్రోగ్రామ్స్‌ను ఆరోగ్య సంరక్షణ అవసరాలకు అనుగుణంగా తీసుకురావాల్సిన మార్పులపై చర్చిస్తారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన భువనేశ్వరిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

పెదపూడి: విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. గండ్రేడు గ్రామంలో బుధవారం ఆయన బాస్కెట్ బాల్ అండర్-14 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన చింతపల్లి భువనేశ్వరిని, రాష్ట్ర స్థాయిలో బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించి మరో ఇద్దరు విద్యార్థులను అభినందించారు. వారు. జి.మామిడాడలోని పీఎం శ్రీ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి, ఎన్డీఏ నాయకులు తమలంపూడి శివరామారెడ్డి, గంటా రాజు తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ కనిపించడంలేదని కేసు

సీతానగరం: తన మోటారుసైకిల్ కనిపించడం లేదని ముగ్గళ్లకు చెందిన గాడి భానుప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. రామహేంద్రవరం తొర్రేడులో పశువులకు వైద్యం చేసేభాను ప్రశాంత్ ఆగస్టు 27న బైక్‌పై సీతానగరం మండలం ఉండేశ్వరపురం వచ్చారు. ఇక్కడ పశువులకు వైద్యం అందించడానికి మోటారుసైకిల్‌ను పక్కన పెట్టి అరగంటలో తిరిగి వచ్చి చూడగా కనిపించలేదు. దానిపై బుధవారం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో భాను ప్రశాంత్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం..

- పచ్చని ఉద్యానవనాలతో ప్రశాంతమైన వాతావరణం
- వనసమారాధనలకు నిలయంగా కోరుకొండ మండలం



విమానాశ్రయం ఎదురుగా ఉన్న ఉద్యానవనం



విమానాశ్రయం పరిసరాల్లోని మామిడితోట

మధురపూడి: పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు, ప్రశాంత వాతావరణంతో దర్శనమిస్తుంది కొరుకొండ మండలం. ఇక్కడ పెద్ద పెద్ద చెట్లు, పూలు, పండ్ల తోటలతో ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తుంది. ఉద్యానవనాలు చూస్తూ ఆధ్యాత్మిక పర్యటనకు అనువైన ప్రదేశం. ఇది రాజమహేంద్రవరానికి 14 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది కార్తిక మాసం వనసమారాధనకు నిలయంగా మారింది.

ఆహ్లాదకర ప్రదేశాలు

మండలంలోని ఉద్యానవనాలు ప్రకృతి ప్రేమిలకులను పలకరిస్తాయి. ఆహ్లాదకరమైన వాతావరణానికి నిలయాలుగా ఉంటాయి. మధురపూడి, దోసకాయల పల్లి, బూరుగుపూడి, నిడిగట్ల, గుమ్ములూరు,గాదరాడ, జంభూపట్నం, కోటికే శవరం, బొల్లెద్దుపాలెం, కాపవరం, కణుపూరు, నర్సాపురం , రాజవరం గ్రామా ల్లో చాలా కాలంగా ఉన్న తోటలున్నాయి. ఇక్కడి తోటల్లో ఉసిరి, నిమ్మ, పనస, మామిడి చెట్లు ఎక్కువగా ఉండడంతో వనసమారాధనకు వచ్చే వారికి అనుకూలంగా ఉంటుంది. అలాగే కాపవరం పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఉన్న బౌద్ధ క్షేత్రాలు చూడముచ్చటగా ఉంటాయి. మధురపూడిలోని విమానాశ్రయం, అందాలతో పాటు, ఉద్యానవనాలు ఆకర్షణీయంగా ఉంటాయి.

ఆధ్యాత్మిక ప్రదేశాలు

మండల కేంద్రమైన కోరుకొండలో స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఎంతో ప్రముఖమైంది. ఎత్తైన కొండపై స్వామివారి దర్శనమిస్తారు. భక్తిభావంతో ఆయనను వేడుకుంటే అనుకున్నవి జరుగుతాయని నమ్మకం. అలాగే కణుపూరులోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ సందర్శనం, జ్యోతి దర్శనం ఎంతో ముక్తి మార్గమని భక్తులు ఆశిస్తారు. బూరుగుపూడి, కాపవరం గ్రామాల్లోని శైవక్షేత్రాలు ప్రాచుర్యాన్ని పొందాయి. పురాతన కాలం నుంచి భక్తుల పూజలందుకుంటున్నాయి. మునగాల గ్రామానికి వెళ్లే రోడ్డులో పురాతనమైన పాండవులమెట్ట ఉంటుంది. దానిపై చారిత్రాత్మకమైన బౌద్ధక్షేత్రాలున్నాయి.

నెలంతా రద్దీ

పవిత్ర కార్తిక మాసంలో ఎంతో మంది ఇక్కడకు వనసమారాధనకు వస్తారు. ఎక్కడెక్కడ నుంచో వచ్చి మండలంలోని ఉద్యానవనాల్లో సహ పంక్తి భోజనాలు చేసి, సేద తీరుతారు. రోజంతా సందడి చేస్తారు. ఈ కార్తిక మాసమంతా రద్దీగా ఉంటుంది.

ఆరోగ్యకరం



కోరుకొండలోని నారసింహుని క్షేత్రం, కాపవరంలోని బౌద్ధ క్షేత్రం, కణుపురు శివాలయం చారిత్రాత్మక నిలయాలుగా ఉన్నాయి. ఇక్కడ ప్రశాంత వాతావరణం ఉంటుంది. స్వచ్ఛమైన గాలి, నీటితో ఉన్న ఈ ప్రదేశాలనను దర్శించడం ఆరోగ్యకరం. విమానాశ్రయం సమీపంలోని ఉద్యానవనాలు మంచి ఆరోగ్యాన్ని అందిస్తాయి.

– కంటే వినయ్‌తేజ, ప్రకృతి ప్రేమికుడు

ఏటా వెళ్తాం



కోరుకొండ మండలంలోని విమానాశ్రయం పరిసర ప్రాంత తోటలు ఆహ్లాదకరంగా ఉంటాయి. అక్కడ వనసమారాధనలు నిర్వహించడం సంతృప్తికరంగా ఉంటుంది. అందుకే ప్రతి సంవత్సరం అక్కడి కెళ్తాం. వనసమారాధనలు నిర్వహించుకోవడం అలవాటుగా మారింది.

– కె.సుబ్రహ్మణ్యం, ప్రకృతి ప్రేమికుడు, రాజమహేంద్రవరం

15 నుంచి నిరుద్యోగుల నైపుణ్య గణన



మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న సిబ్బంది

సీతానగరం: మండల గ్రామాల్లో నిరుద్యోగులను గుర్తించి వారికి ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి ఇంటింటి నైపుణ్య గణన కార్యక్రమం చేపట్టిందని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనీలు వి.ఫణికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు నైపుణ్య గణన యాప్‌లో నమోదు చేసే అంశలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనీలు ఫణి కుమార్, పి.ధనరాజేష్, స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ టి.గణేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైపుణ్య గణన ఆధార్‌తో అనుసంధానం చేయడంతోపాటు విద్యార్హత తదితర వివరాలను నమోదు చేయాలన్నారు. 15 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకు స్త్రీ, పురుషులు ఈ నైపుణ్య గణనలో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ శివ గోపాల్, జూనియర్ అసిస్టెంట్ ఎ.సునీత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇండియన్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా నల్లమిల్లి ఆదిరెడ్డి



రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నల్లమిల్లి ఆదిరెడ్డి



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెిడక లక్ష్మణగాంధీ



రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సత్తి దివ్య



రాష్ట్ర కోశాధికారి నల్లమిల్లి అనిల్‌కుమార్‌రెడ్డి

పెదపూడి: అనపర్తి గ్రామానికి చెందిన నల్లమిల్లి ఆదిరెడ్డి ఇండియన్ ఫార్మాసిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాలుగో సారి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. అనపర్తిలో ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఢిల్లీ నుంచి జాతీయ అధ్యక్షుడు అభయ్‌కుమార్, జాతీయ జనరల్ సెక్రటరీ భూపేంద్రకుమార్ ప్రకటించారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బిక్కవోలు మండలం కాపవరం గ్రామానికి చెందిన పీడక లక్ష్మణగాంధీ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా అనపర్తి గ్రామానికి చెందిన సత్తి దివ్య, రాష్ట్ర కోశాధికారిగా బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామానికి చెందిన డాక్టర్ నల్లమిల్లి అనిల్ కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా నియమితులైయ్యారు. ఈ సందర్భంగా నల్లమిల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ 13 మే 2020 నుంచి ఫార్మసీ రంగా అభివృద్ధి కోసం రాష్ట్ర అధ్యక్షుడిగా అనేక కార్యక్రమంలో పాల్గొని, ఫార్మసిస్ట్‌ల సమస్య పరిష్కారానికి కృషి చేశానన్నారు. తనకు లభించిన ఈ పదవి ద్వారా రాష్ట్ర స్థాయిలో డాక్టర్ ఆఫ్ ఫార్మసి, ఫార్మసీ విభాగంలో చదువుతున్న విద్యార్థులు ఫార్మాసిస్ట్‌లు, ఫార్మా కంపెనీల్లో పనిచేస్తున్న వారి సంక్షేమానికి తన వంతు సాయం అందిస్తానన్నారు. అలాగే రాష్ట్రంలోని ఫార్మా కంపెనీల్లో ఫార్మసీ కోర్స్ స్థానికంగా చదివిన వారికి తప్పనిసరిగా ఉద్యోగ అవకాశం కల్పించేలా, ఫార్మసీ స్టోర్స్‌లో రిజిస్టర్డ్ ఫార్మాసిస్ట్‌లే ప్రోప్రైటర్‌గా ఉండేలా ఉండేలా చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి, ప్రముఖ నేతలు, గ్రామ పెద్దలు వీరిని అభినందించారు.

సత్యనారాయణమూర్తి సేవలు మరువలేనివి



సత్యనారాయణమూర్తి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు

బిక్కవోలు: మాజీ ఎమ్మెల్సీ ఉండవిల్లి సత్యనారాయణమూర్తి సేవలు మరువలేనివి అని విశ్రాంత ఉపాధ్యాయుడు వల్లూరి పరశురామచౌదరి అన్నారు. బుధవారం సత్యనారాయణమూర్తి వర్ధంతిని పందలపాక గ్రామంలోని వెలంపేట రామాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు గొర్రిపోటి సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఉండవల్లి' సేవలు చిరస్మరణీయం

మధురపూడి: రాయవరం దత్తుడుగా పిలిచే ఉండవల్లి సత్యనారాయణమూర్తి సేవలు చిరస్మరణీయమని గర్లంక రమేష్ అన్నారు. బుధవారం కోరుకొండ మండలం బూరుగుపూడి రామాలయం సెంటర్‌లో ఉండవల్లి వర్ధంతి సభ జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ ఉండవల్లి సేవలను కొనియాడారు. తొలుత ఉండవల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సాకినేని మల్లికార్జునరావు, మూతిన రామకృష్ణ, కొటారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

షష్టి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం



ఉత్సవాలకు రాట మూహూర్తం చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

పెదపూడి: అనపర్తిలో వీర్రాజు మామిడి వద్ద కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద వచ్చే నెల 7వ తేదీన జరిగే షష్టి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం బుధవారం ఘనంగా చేశారు. ఉదయం ఆలయం వద్ద స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 27న ఏకాదశి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి భక్తులు మాలధారణగా చేస్తారన్నారు. డిసెంబర్ 5న కావిడి ఉత్సవం, 7న షష్టి, 8న అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



సంపర గ్రామంలో అయ్యప్పస్వామి పడి పూజ చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు



అయ్యప్పస్వామి పడి పూజకు వచ్చిన భక్తులు

పెదపూడి: సంపర గ్రామంలో బుధవారం రాత్రి అ య్యప్పస్వామి పడి పూజ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో రామాలయం వద్ద సుమారు 150 మంది స్వాములు ఏర్పాటు చేసుకున్న పీఠం వద్ద పూజలు చే శారు. ప్రముఖ పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బిక్కవోలు విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బిక్కవోలు: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పళ్లా వీర ప్రభాకరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాఠశాల క్రీడల సమాఖ్య అండర్-17 బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయిలో తూర్పుగోదావరి జిల్లా నుంచి పాల్గొనే జట్టులో పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు తులసీరామ్‌చరణ్, వెంకట వినయ్ ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 9, 10 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రెండు వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

సారా తయారు చేస్తే కఠిన చర్యలు



ఈలకొలనులో స్వాధీనం చేసుకున్న బెల్లపు ఊటతో ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: ఈలకొలను గ్రామంలో బుధవారం ఈఎస్ఎఫ్‌టీ బృందంతో ఎక్సైజ్ సీఐ అడబాల సతీష్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామ శివారు జీడిమామిడి తోటలో సారా తయారీకి సిద్ధం చేసిన రెండు వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన గుత్తుల సూరిబాబు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి మృతికి సంతాపం



సంతాపం తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

రాజానగరం: ఏలూరు జిల్లా, ఆడిరిపల్లి, హీల్ ప్యారడైజ్ ప్రాంగణంలో జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమంలో గుండె పోటుతో మృతి చెందిన ప్రధానోపాధ్యాయుడికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. మండలంలోని కొండగుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న పునాది అభ్యసన శిక్షణ తరగతులలో రెండు నిమిషాను మౌనం పాటించి, తమ సానుభూతిని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న వెంటనే శిక్షణా కార్యక్రమం నుంచి బయటకు సంతాపాన్ని తెలియజేశారు.

పట్టభద్రుల ఓటు హక్కుకు వెల్లువెత్తిన దరఖాస్తులు



మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద దరఖాస్తులు తీసుకుంటున్న సిబ్బంది

రాజానగరం: జిల్లాలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కును పొందేందుకు బుధవారం ఆఖరి రోజు కావడతో పట్టభద్రులు క్యూకట్టారు. పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం ఆసక్తిని చూపడంతో చివరి రోజు రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద టెంట్లు వేసి మరీ, రాత్రి సమయంలో కూడా దరఖాస్తులు తీసుకునే ప్రక్రియను కొనసాగించారు. అలాగే వచ్చిన దరఖాస్తులను స్క్రూటీని చేయడంలో తహసీల్దారు కార్యాలయాల సిబ్బంది కూడా తలమునకలై విధులు నిర్వర్తిస్తున్నారు.

నాన్ రెసిడెన్షియల్ మోడ్‌లోనే శిక్షణ ఇవ్వాలి

- ఉపాధ్యాయ సంఘం డిమాండ్



శిక్షణా తరగతుల వద్ద సంతాపాన్ని తెలియజేస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి

రాజానగరం: వృత్తిపరంగా ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణా కార్యక్రమాలన్నీ నాన్‌రెసిడెన్షియల్ మోడ్‌లో జరగాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎన్. అరుణకుమారి డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా, ఆడిరిపల్లి, హీల్ ప్యారడైజ్ ప్రాంగణంలో జరుగుతున్న స్కూల్ లీడర్ షిప్ శిక్షణా కార్యక్రమంలో గుండె పోటుతో మృతి చెందిన ఉండూరు మండలం, ఉండి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వి.రత్నకుమార్‌కి యూటీఎఫ్ తరపున సంతాపం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండలంలోని మల్లంపూడిలో జరుగుతున్న లీడర్షిప్ శిక్షణా తరగతులను బుధవారం యూటీఎఫ్ ప్రతినిధులు సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయులంతా వృత్తిపరంగా అనేక ఒడిదొడుకులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ఈ సమయంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు వద్దని చెపుతున్నా బలవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. శిక్షణ తరగతులను నాన్‌రెసిడెన్షియల్ మోడ్‌లోనే ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలోపు జరగాలన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దయానిధి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, ఇచ్చిన ఈ డిమాండ్లను అమలు చేయకుంటే తరగతులను బహిష్కరిస్తామని, అందుకు లీడర్షిప్, ఎఫ్ఎల్ఎన్ శిక్షణ పొందుతున్న, పొందబోయే ఉపాధ్యాయులంతా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనుబాబు, టి.ఫణికుమార్, జిల్లా కౌన్సిలర్ పి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బీపీటీ-3082 దిగుబడి ఆశాజనకం



పంటకోత ప్రయోగంలో దిగుబడిని పరిశీలిస్తున్న నైరా విద్యార్థులు

రంగంపేటలో పంటకోత ప్రయోగం

రంగంపేట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు ప్రయోగాత్మకంగా సాగు చేసిన బీపీటీ-3082 దిగుబడులు ఆశాజనకంగా ఉన్నట్టు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వ్యవసాయ కళాశాలకు చెందిన నైరా విద్యార్థులు తెలిపారు. చిరు సంచుల ప్రదర్శనలో భాగంగా మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో బుధవారం పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు పోతుల పద్మారావు వ్యవసాయ క్షేత్రంలో ఏరువాక కేంద్రం రాజమహేంద్రవరం సీనియర్ శాస్త్ర వేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్షేత్ర పరిశీలనలో ఉన్న చిరు సంచుల రకాలు బీపీటీ-3082ను పంట కోత ప్రయోగం ద్వారా పరిశీలించగా ఎకరాకు సుమారు 30 క్వింటాలు దిగుబడి వచ్చిందన్నారు. ప్రస్తుతం ఉన్న బీపీటీ-5204 ఎకరాకు 28.5 క్వింటాలు దిగుబడి వచ్చిందన్నారు. దీనిని బట్టి ప్రస్తుత బీపీటీ-5204 కంటే కొత్త రకం బీపీటీ-3082 అధిక దిగుబడి లభించిందని చెప్పారు. ఈకార్యక్రమంలో నైరా విద్యార్థులు సాయి శ్యామలా, నాగమణి, చరిష్మా, ఎర్రాయమ్మ, సునీత పాల్గొన్నారు.


గౌరమ్మ తల్లికి సారె సమర్పణ



గౌరమ్మ తల్లికి గ్రామస్తులు సమర్పించిన పసుపు, కుంకుమ, సారె

బిక్కవోలు: పందలపాక గ్రామంలో ఐదేళ్లకు ఓసారి జరిపే గౌరమ్మ తల్లి సంబరంలో భాగంగా బుధవారం గ్రామస్తులు అమ్మవారికి సారె సమర్పించారు. అన్ని రకాల పిండివంటలు పసుపు, కుంకుమతో సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల అవకతవకలపై విచారణ



గ్రామ సభలో మాట్లాడుతున్న విచారణ అధికారులు

రాజానగరం: ముక్కినాడలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి పనులలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై ఏపీడీ బి.రాంప్రసాద్ విచారణ నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ విచారణ ఇంకా పూర్తి కాలేదని, పూర్తయిన వెంటనే సంబంధిత నివేదికను డ్వామా పీడీకి అందజేస్తామని రాంప్రసాద్ తెలిపారు. గ్రామంలో లేని వారికి, పనులకు హాజరుకాని వారికి కూడా మస్తర్లు వేసి, సొమ్ములు స్వాహా చేశారంటూ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టినట్టు తెలిపారు. ఎస్ఆర్ఈజీఎస్ మండల ఇన్‌చార్జ్ ఏపీఓ బాలరాజు కూడా ఈ విచారణలో పాల్గొన్నారు.